తెల్ల వారితే....?

పీక్కుపోయిన దవడలు, లోతుకుపోయిన కళ్ళు. చిప్పిరెంటికలు మాసికలు పడ్డచీర చీపురుపుల్లలా ఉన్న కాళ్ళతో శరీరాన్నీడ్చుకుంటూ ఊరిదిక్కు నడుస్తుంది లచ్చమ్మ......గ్రీష్మంలో ఆకులు రాల్చిన మొండిమానులా, శరీరంపై తాళితప్ప మరే ఆభరణమూలేదు నెత్తిపైనున్న తుమ్మపొరక ముళ్ళు గుచ్చుతుంటే ఆయాసపడుతూ నడుస్తుంది ... ఊరిముఖం పట్టిన పశువుల గిట్టలచప్పుడు లయబద్ధంగా వినవస్తుంది ఒకచేత్తో తలపైనున్న పొరకను పట్టుకొని, మరోచేత్తో పశువులు నడుస్తుంటే లేచిన దుమ్ము పోకుండా ముక్కుకడ్డంగా కొంగుపెట్టుకుంది ... దుమ్ముతో స్నానం చేసినట్టు శరీరమంతా ధూళి పడుతూనేవుంది. చెప్పులులేని కాళ్ళు దుమ్ముతో తెల్లగా అగుపడుతున్నాయి. ఆమె ముఖంలో బాధ ... ఆవేదన... అలసట .....అలసటగా ఇల్లుచేరుకొని తలపైనున్న తుమ్మపొరక గుడిసె వెనకభాగంలో వేసింది. అక్కడే కుండల్లోవున్న నీళ్ళతో కాళ్ళు కడుక్కొని గుడిసె తలుపు తీసుకొని ఇంట్లోకెళ్ళింది కాళ్ళు విపరీతంగా గుంజుతుంటే నేలపై కూర్చుండిపోయింది. చేతుల్తో కాళ్ళు నొత్తుకుంది అవ్వావ్వావ్వా అంటూ కాళ్ళు చాపింది. అలాగే నేలపై కొరిగింది. ఎర్రిమన్నుతో అలుకబడ్డ నేలమన్ను చీరకంటుతుండగా ఆయాసంగా అటు ఇటూ బొర్లింది కొద్దిసేపట్లో నిద్రలోకి జారుకుంది ..వయసును మించిన వృద్ధాప్యాన్ని మోసుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చిన ఎల్లయ్య నేలపై పడుకోనున్న లచ్చమ్మను చూసి ఏందే గీ సందలు పడంగ పంటన్నవు ... లే ...లే ....లేని పొయ్యంటు పెట్టి జెల్దిన బువ్వండు ....బాగాకలయితంది లే లే"

అంటూ గుడిసెలో నున్న నులకమంచం వాల్చుకొని పడుకున్నాడు. భర్త మాటలకు ఉలిక్కిపడి లేచింది. లచ్చమ్మ .... లేచి పని చేత్త మంటే చేతకావడంలేదు. పొద్దంతా వెనుక కెనుకకు నడుస్తూ మోకాళ్ళబంటి దిగుబాట్లో నాటేసింది. అడుగుతీసి అడుగువెయ్యడమే కష్టంగా వుంది. దానికితోడు ఒడ్డుపైనిల్చొని యజమాని తొందరగా కానియ్యమని గోలచెయ్యడం, పూర్తిగా అలసిపోయింది లచ్చమ్మ బలవంతంగా లేచి సత్తువ తెచ్చుకొని నిల్చింది. పొయ్యి దగ్గరకెళ్ళి అందులోని బూడిద తట్టలోకి ఎత్తింది.... బయటకెళ్ళి తుమ్మపొరకను చిన్న చిన్న పుల్లలుగా విరుచుకొచ్చి పొయ్యిదగ్గర పడేసింది. మూలకున్న కుండలోనుంచి సోలెడన్ని నూకలు తీసిచేటలో పోసింది అందులోని తపుడు, మెరిగలు చెరిగింది. రాళ్ళేరేసింది వాట్ని అల్యూమినియం పాత్రలోపోసి మంచినీళ్ళతో కడిగింది...... ఆ పాత్రను పొయ్యిదగ్గర పెట్టి ఓ గూనపెంక తీసుకొని నిప్పుతేవడానికి పక్కింటి కెళ్ళింది. పిడుక నిప్పుదెచ్చి పొయ్యిలవేసింది. ఆ పిడుకను పలగ్గొట్టి నిప్పుపై పెట్టి 'ఉప్ ఉప్' అని ఊదసాగింది. ఎంత ఊదినా పొయ్యి మండటంలేదు. కలపతో చేసిన పొయ్యూదే గొట్టంతో మళ్ళఊదింది. కళ్ళవెంట నీరుకారుతున్నాయి... కొంచెం సేపట్లో పొయ్యి అంటుకుంది. తుమ్మపొరక ముక్కలు దాని పై పెట్టి మళ్ళీ ఊదింది. మంటలేచింది నూకలు కడిగివున్న పాత్రను పొయ్యిపై పెట్టింది. పొయ్యిముందు కూర్చొని ఒక్కొక్క పుల్ల పొయ్యిలో పెడుతుంది. చలిగావుండే కాళ్ళు పొయ్యిదగ్గరకు చాపి అరచేతులు మంట మీదికి చూపుతూ చలికాగుతుంది. మంచంలో పడుకోనున్న ఎల్లయ్య మూలుగుతున్నాడు.

'ఎందేమో మూలుగవడితివి?' భర్తనుద్దేశించి అంది లచ్చమ్మ"

'సలిపెడతందే! వణుకత్తంది' ముడుచుకొని పడుకొని అన్నాడు ఎల్లయ్య 'గిటొచ్చి పొయ్యిదగ్గర కూకోలేవు. ఎచ్చగుంటది"

భార్య మాటలు వింటూనే మంచంలో నుండి లేచి కుంటుతూ పొయ్యి దగ్గరకొచ్చాడు ఎల్లయ్య భార్య కొంత దూరములో కూర్చొని పొయ్యి దగ్గరకు కాళ్ళుచాపి మంటపైగా చేతులుపెట్టి చలికాగుతున్నాడు ఎల్లయ్య భర్త కుంటుతూ రావడం చూసిన లచ్చమ్మ 'ఎందేమో కుంటపడితివి" అంది 'కాలుకు పెద్దముల్లిరిగిందే పిన్నిసుతోని తీసిన గవి కూసంలో వన్నె పెయినట్టుంది జల జల జలుపుతుంది' అన్నాడు ఎల్లయ్య

"ఏది ఇటు సూడనియ్యి" అని భర్త కాలిని చేతిలోకి తీసుకుంది లచ్చమ్మ ముల్లుగుచ్చిన చోట రంధ్రంలాగుంది రక్తం పేరుకొనివుంది చేతితో మెల్లగా ఒత్తింది. 'వయ్యా వయ్య'అని మొత్తుకున్నాడు ఎల్లయ్య లచ్చమ్మ బయటకెళ్ళి ఓ ఇటుక ముక్క తెచ్చి పొయ్యిలో వేసింది. కొంచెంసేపయిన తర్వాత బయటకుతీసి ఓ పేగులో మలిచింది. దాంతో ఎల్లయ్య కాలును కాపసాగింది వెచ్చటి ఇటుక కాలికి తగులుతున్న కొద్ది బాధగానూ, హాయిగానూ వుంది ఎల్లయ్యకు కొంతసేపు కాపి ఇటుకముక్క బయట పారేసొచ్చింది పొయ్యికెదురుగా కూర్చుంది. అన్నం తుక తుక ఉడుకుతుంది .... మూతతీసి కింద బెట్టింది గంపెతో అన్నాల్ని కలిపింది. భర్త దిక్కుచూస్తూ "ఏందియ్యాల పొద్దుగాల్నె అచ్చినవు?" అంది

"ఏం పొద్దుగాల్నె...పొద్దుటి నుంచి ఐదారెకురాల పెరడికి నీళ్ళు గట్టినం యాట్టకొచ్చింది.నీళ్ళు గట్టంగనే ముల్లుగుచ్చి రగుతం గారింది నీళ్ళు గట్టుడు అయిపోయెటాల్లకు పొద్దుగూకే.. ఎడ్లు గట్టేసి మాతేసి

పొమ్మాన్నాడు పటేలు .....కని నేనే కాలు జలుపుతుందని ఎల్లచ్చిన' అన్నాడు అబ్బోదెన పటేలు పోనిచ్చాడా మరి? 'గయి నేనా పోనిచ్చటోడు గని ఇంకో పాలెరోడు అపజ్జేత్తడని సెప్పి మెల్లగా బయిట పడ్డా ... పొద్దందాక కాలువలు తెంపుకుంట నీళ్ళు గట్టన్నంటే అలిట్టకచ్చె ఇగ గడ్డాము గడ్డి పీకన్నంటే సేతులు పీక్కపోతాయి 'ఇగ మన బ్రితుకులే గింతాయే తియ్యి' అంటూ ఉడికిన అన్నంచూసి కొంగుతో పాత్రను పొయ్యిపైనుంచి దించి క్రిందబెట్టింది లచ్చమ్మ చెంబులో వున్న నీళ్ళుచల్లి పొయ్యినార్పింది. ఇంతలో భుజంపై నిలు వెత్తున్న గడ్డపార పెట్టుకొని మోసుకుంటూ ఇంట్లోకొచ్చాడు శ్రీనివాస్ ఆ గడ్డపారను గుడిసెలో మూలకు పడేపి "బాగాకలయితందె అవ్వ జెప్పన బువ్వెయ్యి' అని బయటకెళ్ళాడు ...కాళ్ళుచేతులు కడుక్కొ నొచ్చి నేలపై కూర్చున్నాడు కొడుకు ప్రక్కనే ఎల్లయ్య కూర్చు న్నాడు........ నల్లగా సాగబారి నట్టుంది అలసటగావున్న కొడుకు ముఖంలోకి ఆప్యాయంగా చూసాడు...లచ్చమ్మ రెండుఅల్యూమినియం గిన్నెల్లో వేడి వేడి నూకలన్నం వేసుకొచ్చి ఇద్దరి ముందు పెట్టింది పొద్దున చేసిన పులుసు గిన్నెను వాళ్ల ముందరకు జరిపింది .. చిప్పలో వున్న చింతకాయ పచ్చడి ఇద్దరి కంచాల్లో చెరికొంత వేసింది అన్నం కలుపుతున్న శ్రీనివాస్ 'అయ్ అయ్' అంటూ కంచంలో నుండి చేతిని పైకి తీశాడు

'ఏమైంది బిడ్డ ఎమైంది?' అని లచ్చమ్మ కొడుకు దగ్గరికొచ్చింది శ్రీనివాస్ తన రెండు అరచేతులు చూపించాడు .. ... పొక్కులొచ్చి ఉబ్బివున్న కొడుకు చేతులను చూసిన ఆ తల్లిదండ్రుల హృదయాలు ద్రవించాయి...... 'బాయడుగు బండకన్న గట్టిగుంది ...... ఎంత తవ్వినా పెల్లయితె కుల్తపెలేదు తవ్వి తవ్వి సేతులన్ని పాడాయే ...

పొద్దుందాక ముగ్గురం మనుషులాందవ్వతే జానెల్లోతన్న తెగపాయె.
లోతుకుపోయినాకొద్ది గట్టిగుంటంది. గజాన సూరియ్యమంటేడ్సిరి. రోజు
పదన్న కయికిలి పడుతలేపాయే అన్నాడు శ్రీనివాస్ తల్లిదండ్రులతో

కొడుకు చెప్పేది వింటూనే చేతులను తన చేతిలోకి తీసుకొని ఆప్యాయంగా నిమిరింది లచ్చమ్మ.

'బిడ్డ నీకు కలుపుకోరాదు సేతులు మండుతయ్ .. నేంగలిపి నోట్ల పెడుతపట్టు" అని అన్నం కలుపుతూ ఒక్కో బుక్క నోట్లోపెడుతుంది.

'అట్టి పులుసుతోని తినబుద్ధయితలేదే అవ్వ .. కొంచమంత పప్పన్నెయ్యక పెయినవే' అన్నాడు శ్రీనివాస్.

'ఇసిర్న కాడికయిపొయింది బిడ్డ మానెడన్ని పెసల్లు మావున్నయి గని ఎండవోసి ఇసుర్తామంటే తీరుతలేపాయె" అన్నం తినిపిస్తూ లచ్చమ్మ "అయిత మాయెపట్టు ఎట్లనో నాలుగు బుక్కల్తింటే ఐపోయె ...గాసింతకాయ తొక్కు కలిప్పెట్టే అవ్వ మంచిగుంది' అని అన్నం తింటూ 'గీ తొక్కెక్కడిదే అవ్వ" అన్నాడు శ్రీనివాస్

పొద్దంతా కట్టెలు గొట్టించుకొని అడుగడుగంగ ముత్తెమంత పెట్టింది పటేలవ్వ' అన్నాడు ఎల్లయ్య. మంచినీళ్ళు తాగుతూ చెంబు కిరింద పెట్టి 'తమ్ముడు రాలేదాయె నాయిన్న"? అన్నాడు శ్రీనివాస్

చిన్నకొడుకు జోలితీయగానే ఆ పేద తల్లిదండ్రుల హృదయాల్లో చేయిపెట్టి కెలికినట్టయింది.

"పొల్లగాన్ని కర్నపయినే కమ్మినట్టె ఐపాయె సిన్నపోరి లగ్గాని కని తెచ్చిన ఐదునూర్ల కిందికి యాడాది పట్టి పోరడు పజ్జేసిన బాకి తీరుతనే లేపాయె బుక్కెడంత తిని పొద్దుందాక తెల్లందాక అక్కన్నే పజ్జేసుడాయె...... రొండు మూడు రోజుల కోసారి అట్లచ్చిపోతండు" అన్నాడు ఆవేదనగా ఎల్లయ్య... ఇద్దరూ అన్నం తినడం ముగించారు.

...లేచి వాల్చిన మంచంలో కూర్చున్నారు. బావులు తవ్వుతూ వచ్చె కూలిపనితో బ్రతకడం కష్టమని, తాను బొగ్గుబాయి పనికి పోతానని కొడుకు చెపుతుంటే వింటున్నాడు ఎల్లయ్య ..లచ్చమ్మ అన్నం తినడం పూర్తి చేసుకొని ఖాళీపాత్రతో నీరుపోసి ఆముదం సీసతో కొడుకు దగ్గరి కొచ్చింది ...సీసాలో ఆముదాన్ని కొడుకు అరచేతులకు రాసింది... నేలపై గోనెసంచీ దానిపై పాతబట్టలతో కుట్టిన బొంత వేసుకొని పడుకుంది... పాత చీరపైనుంచి కప్పుకుంది...ఎల్లయ్య, శ్రీనివాస్ చెరో నులక మంచంలో పడుకున్నారు...ఎల్లయ్య చిరుగుయి బట్టిన గొంగడి కప్పు కున్నాడు. శ్రీనివాస్ చద్దరు కప్పుకున్నాడు ..గుడిసె తలుపు సందుల నుంచి, పైరంధ్రాల నుంచి చల్లనిగాలి "సుయ్ సుయ్" మంటు వస్తుంది గాలి చల్లగా శరీరానికి తగిలినప్పుడల్లా వాళ్ళు వణికి పోతున్నారు .... కాళ్ళు దగ్గరకు మలచుకొని కడుపులో తలలు పెట్టుకొని పడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు ..కాని వాళ్ళు కప్పుకున్న బట్టలు ఆ మాఘమాసపు చలినే మాత్రం ఆపలేక పోతున్నాయి. ఎంత ప్రయత్నించిన నిద్దరా వడం లేదు. పొద్దంతా బండచాకిరీ చేసి అలసిపోయినా వాళ్ళ శరీరాలు ఆ ఎముకలు కొరికే చలిని జయించి నిద్రలో కొరగలేక పోతున్నారు. లచ్చమ్మ కాళ్ళు జల జల సలుపుతున్నాయి. తన నలభై ఐదేళ్ళ జీవితం గూర్చామె మననం చేసుకుంటుంది. పుట్టి బుద్దెరిగినప్పట్నుంచీ కూలి పనితోనే బ్రతుకుతుంది తాను. దొరికిన్నాడు తినడం దొరకన్నాడు. పస్తెలుండటం ఎన్నేల్లు కూలిపనిజేసినా తన కష్టాలు గట్టెక్కడం లేదు రోజు రోజుకు తన బ్రతుకింకా దుర్భరమౌతుంది... తాను కూలిపనిజేస్తు ఎన్ని తిట్లుతిన్నాది? ఎం అభిమానం చంపుకొని బ్రతికింది?... తన పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు వాళ్ళనొదిలి కూలికెళ్ళిన తాను వాళ్ళకు పాలివ్వడానికి ఇంటికెల్తానంటే యజమానితో తిట్లు....అవమానకరమైన మాటలు.. తాను తన జీవితమంతా పరాయి వాళ్ళ భూముల్లో కేవలం

కూలికోసం కలుపు తీసింది నాట్లేసింది అలుకుడు చేసింది... కోత కోసింది... మోత మోసింది నీళ్ళు గట్టింది మరెన్నో పనులు చేసింది. ఎన్ని చేసిన పొయ్యికింది కుంటే పొయ్యిమీది కుండదు ... పొయ్యిమీది కుంటే కింది కుండదు... పొద్దంతా ఒళ్ళు హూనం చేసుకున్న పస్తులు తప్పవు.

పొద్దంతా పనిచేసిన తనకు ప్రొద్దుగూకిందంటే కొంత తృప్తి కొంత విశ్రాంతి తీసుకోవచ్చు కలో గంజో తాగి కాళ్ళు చాపుకొని పడుకోవచ్చు తెల్లవారితే— ఒంటెద్దు చాకిరీ గబగబా పనికురకడం చేతనైనా కాకున్నా యంత్రంలా పనిచేయడం. ఈ రాత్రి రాత్రిగానే వుండాలి. తెల్లవారకూడదు అనుకుంటూ నిద్రలోకి జారుకుంది లచ్చమ్మ ఎల్లయ్య పాత గొంగళి గుండ్రంగా ముడుచుకొని పండి తన జీవితం గూర్చి ఆలోచిస్తున్నాడు .. తనకు నలుగురు పిల్లలున్నా అంతా కూలీలే అయ్యారు తన యాభై ఏళ్ళ జీవితంలో గ్రీష్మాలనే తప్ప వసంతం ఎరగడు వ్యవసాయకూలీగా, పాలేరుగా ఎన్నో కష్టాలు పడ్డాడు... రక్తాన్ని చెమటగా మార్చాడు...ఎముకలను కలి కలి చేసుకున్నాడు—ఎండలో, వానలో. చలిలో దుక్కి దున్నాడు...విత్తనాలేసాడు మడికట్టు, జంబు, పునాస దున్ని ఒళ్ళు హూనం చేసుకున్నాడు మోట కొట్టాడు. నీళ్ళు కట్టాడు— బంతి కొట్టాడు— బండికట్టాడు — అయినా తనకు మిగిలింది ఆకలి కడుపు — తెల్లవారింది మొదలుకొని మళ్ళీ రాత్రి పడుకునే వరకు పని...పని——పని— పశువులకంటే అధ్వాన్నమయిన చాకిరీ—రాత్రి కొంత విశ్రాంతి—తెల్లవారితే మళ్ళీ గానుగెద్దు జీవితం—కాళ్ళుగుంజినా డొక్కఎండినా శరీరమంతా పూర్తిగా అలిసిపోయినా తప్పని పని తెల్లవారకూడదు. రాత్రి ఇలాగే వుండాలి. అనుకుంటూ అర్ధరాత్రి వరకో నిద్రపోయాడు ఏల్లయ్య.

శ్రీనివాస్‌కు బండలను పిండిగొట్టే తన కూలిపని జ్ఞాపకమొస్తుంది పొద్దు పొడిచి పొడవక ముందుపోతే పొద్దుగూట్లో పడేంతవరకు శ్రమ చేయాలి — తన చేతులకు బొబ్బలొచ్చినా, బండలు చిల్లి గాయాలైనా ఎంత అలసి సొలసినా పని చేయకతప్పదు —. శరీరం జల జలా సలుపుతున్నా ఆరోగ్యం బాగా లేకపోయినా కూలికెళ్ళాలి — లేకుంటే పొట్ట నిండదు — పండుగనక పబ్బమనక అన్నికాలాలు తటమోయాలి — తట్టనింపాలి — తవ్వాలి — సూర్యోదయమవుతుంటే చాకిరీ తప్పదు — తెల్లవారకుండా ఉంటేనే కొంతైనా హాయి — అని ఆలోచించుకుంటూ సగం రాత్రి గడిచాక నిద్రాదేవి ఒడిలో కొరిగాడు శ్రీనివాస్.

వాళ్ళెంత తెల్లవారొద్దనుకున్న కోడిపుంజు మూడవసారి కూయగానే దిగ్గున లేచారు — తెల్లవారడానికింకా గంటుందనగానే ఎల్లయ్య ఆక పెడ్ల మేపడానికై పశేలు ఎడ్లకొట్టం దిక్కు నడిచాడు కొంత సెపటికి తర్వాత శ్రీనివాస్ భుజంపై గడ్డపార పెట్టుకొని బయటకు నడిచాడు...లచ్చమ్మ తన గృహ కార్యక్రమాల్లో నిమగ్నురాలయింది.

ఎల్లయ్య కుటుంబాల్లాంటి లక్షలాది కుటుంబాలకు సూర్యోదయం భయం భయంగానే దర్శనమిచ్చింది. — వాళ్ళ బ్రతుకుల్లో వెలుగు నింపే సూర్యోదయం వస్తే —? రాత్రిని కాక సూర్యోదయాన్నే ఆహ్వానిస్తారందరూ — అదే నిజమైన తెల్లవారడం.

ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం 14-4-85